# ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల ధర్నా



2 లో

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 19 | మార్చి | 2024
పేజీలు 5

# ఎన్నికల వేళ హై అలెర్ట్



ఫైల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ, దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల వేళ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో హై అలెర్ట్ కొనసాగుతోంది. మూడు రోజుల క్రితం కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించ డంతో దేశ వ్యాప్తంగా ఎన్నికల వాతావరణం నెల కొంది. ప్రధానంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,

మిగతా 2లో..

**- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై గట్టి నిఘా**
**- త్వరలో అంతర్రాష్ట్ర పోలీస్ అధికారుల సమావేశం**

### చెవిదిద్దులు కొనివ్వలేదని

## భర్తపై భార్య హత్యాయత్నం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చెవిదిద్దులు కొనివ్వ లేదని ఓ భార్య తన భర్తపై టర్పెంటాయిల్ పోసి నిప్పంటించిన సంఘటన ఖమ్మం నగరంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం నగరంలోని నిజాంపేటలో షేక్ యాకూబ్, సమీనా దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత కొంత కాలంగా భార్య సమీనా చెవిదిద్దులు కొనివ్వాలని భర్తను అడగ సాగింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఆ విషయంపై వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. చెవిదిద్దులు కొనేందుకు తన వద్ద నగదు లేదని భర్త యాకూబ్ చెప్పడంతో క్షణికావేశానికి గురైన భార్య సమీనా పెయింట్స్‌కు వాడే టర్పెంటాయిల్ భర్తపై పోసి నిప్పంటించింది. మంటల్లో కాలుతూ యాకూబ్ పాషా గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు, బంధువులు వచ్చి మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. యాకూబ్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ఎన్నికల నిర్వహణలో

## నిఘా బృందాల పాత్ర కీలకం

**శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ విపి గౌతమ్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణలో నిఘా బృందాల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, ఎంసిసి బృందాలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల్లో నిఘా బృందాలు సమర్థవంగా పని చేయాలన్నారు. జిల్లాలో 15 ఎస్ఎస్టి, 12 ఎఫ్ఎస్టి, 27 ఎంసిసి బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మొదటి 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ఆవరణల్లో, 48 గంటల్లో పబ్లిక్ స్థలాల్లో, 72 గంటల్లో ప్రైవేటు స్థలాల్లో రాజకీయ నాయకుల, రాజకీయ పార్టీలకు సంబంధించి హోర్డింగ్, ఫ్లెక్సీ, ఫోటోలు తొలగించలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఉండాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సమాచార సేకరణ, ప్రజల్లో సి విజిల్ యాప్‌పై అవగాహన కలిగే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎస్ఎస్టిల పనితీరు క్రియాశీలకంగా ఉండాలని, రిజల్ట్ ఓరియంటెడ్‌గా పని చేయాలన్నారు. అన్ని రాజకీయ పక్షాలు అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఫస్ట్‌కమ్ ఫస్ట్ పద్ధతిలో అనుమతులు ఇవ్వాలన్నారు. అనంతరం స్వీప్ నోడల్ అధికారి కె. శ్రీరాం బృందాలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జెడ్పిసిఈవో వినోద్, సిపివో శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్షలు ప్రారంభం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి పరీక్షలు జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈనెల 30 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ విద్యార్థులు 16,582 మందికి గాను 16,543 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 58 మందికి గాను 46 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు

**-16,543 మంది విద్యార్థులు హాజరు**
**-పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ గౌతమ్**

అవసరమైన మౌలిక వసతులను విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.తాగునీటితో పాటు పరీక్ష గదులలో విద్యుత్ సౌకర్యం, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ ను అమలు చేశారు. పరీక్షా కేంద్రాలను సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశారు. ఐదు నిమిషాల

మిగతా 2లో..

# ఎన్నికల వేళ హై అలెర్ట్

మొదటిపేజీ తరువాయి)
ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, మహారాష్ట్రాలతో పాటు పలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆయా రాష్ట్రాల పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు.

**గట్టినిఘా...**
మావోయిస్టుల ప్రాభల్యం ఉన్న ప్రధాన రాష్ట్రాలు నాలుగైదు గొలుసుకట్టుగా ఉండటంతో అధికారులు గట్టి నిఘా పెడుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల సమాంతరం పాలన సాగుతున్న వేళ ఈ మధ్యకాలంలో కేంద్ర కోబ్రా బలగాలు మావోయిస్టు నేత హిడ్మా ఇలాకాలో అత్యంత అత్యాధునిక బేస్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్రమలోనే మావోయిస్టులు ఉపయోగించే స్వరంగ మార్గం ఒకటి బయటపడింది. మరో ప్రక్క హిడ్మా స్వగ్రామమైన పూంవర్తిలో అతని తల్లిని కలిసిన భద్రతా బలగాలు ఆమెతో ఫొటో దిగి ఆ గ్రామలో జాతీయ జెండాను ఎగురవేసిన విషయం విధితమే. ఇదిలా ఉండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బిజేపి ప్రభుత్వం ఏర్పాటు కావడం, కేంద్రంలోని బిజేపి సర్కార్ మావోయిస్టుల ఏరివేతకు ఆపరేషన్ ప్రహార్ కొనసాగిస్తున్న వేళ మావోయిస్టులు అదును కోసం ఎదురు చూస్తున్నట్లు అంతా బావిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఆనుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, మహారాష్ట్రాలు గొలుసుకట్టుగా ఉండటంతో మావోయిస్టులు సులువుగా వారి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. గడచిన నెల రోజులుగా అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. తాజాగా మూడ్రోజుల క్రితం ఇంద్రావతి నదీ సమీపంలో మావోయిస్టులు, పోలీసులకు ఎదురుకాల్పులు చోటు చేకున్నాయి. అంతకంటే నాలుగు రోజుల ముందు జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక జవాన్, ఒక మావోయిస్టు చనిపోయారు. దీంతో ఆయా ప్రాంతాలపై కేంద్ర భద్రతా బలగాలతో పాటు ఆయా రాష్ట్ర పోలీసులు బాస్‌లు గట్టి నిఘా పెంచారు. వాహనాల రాకపోకలపై కన్నేశారు. గోదావరి ఫెర్రీ పాయింట్లు, అంతరాష్ట్ర రహదారులపై భద్రత పెంచారు. అడవుల్లోనుండి వచ్చే కాలిబాటలపై డేగకన్నేశారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిఘా పెంచుతున్నారు. కోబ్రా, సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి బలగాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అడవులను జల్లెడ పడుతున్న వారు మావోయిస్టుల ఏరివేతక రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరికొన్ని బలగాలను అడవుల్లోనికి పంపి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, వారికి సహకరించే గ్రామాలు, ప్రజలపై ఆరా తీసి అదుపుచేసేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘాపెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

**త్వరలో అంతరాష్ట్ర సమావేశం...**
సార్వత్రిక ఎన్నికలు, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా త్వరలో నాలుగు రాష్ట్రాల పోలీసుల అంతరాష్ట్ర సమావేశాన్ని నిర్వహించనున్నారు. ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐటిసి పివిఎస్‌పిడిలో అంతరాష్ట్ర పోలీసుల సమావేశం జరిగింది. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మరో సారి అంతరాష్ట్ర పోలీసుబాసులు, కేంద్ర భద్రతా సలహాదారుల సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా ఎన్నికల వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రచించాల్సిన వ్యూహాలు, భద్రత తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల ధర్నా

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలోని ప్రభుత్వమెడికల్ కాలేజీ విద్యార్థులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ముందు ధర్నా నిర్వహించిన విద్యార్థులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీలో సదుపాయాలు సరిగా లేవని, మంచినీరు, వసతి, భోజన సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయని అన్నారు. ప్రిన్సిపల్ డ్రెస్‌గోడ్ విషయంలో హేళన చేస్తున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో మెడికల్ విద్యార్థులపై ప్రిన్సిపల్ కోపాన్ని చేస్తున్నారని, తమకు సౌకర్యాలు కల్పించాలని అడుతున్నప్పటికీ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు మండిపడ్డారు. ప్రిన్సిపల్ లక్ష్మణరావు తమకు వద్దని, వెంటనే ప్రిన్సిపల్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోని, తమ మెడికల్ కళాశాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

## లక్ష్మీనర్సింహా స్వామిని దర్శించుకున్న రాయల



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ గా ఎన్నికైన రాయల నాగేశ్వరరావు యాదాద్రి లక్ష్మీ నర్సింహాస్వామిని దర్శించుకున్నారు. సోమవారం యాదాద్రిలోని లక్ష్మీ నర్సింహాస్వామిని గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాయల నాగేశ్వరరావుకు తీర్థ ప్రసాదాలను అందించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని దేవున్ని ప్రార్థించినట్లు రాయల తెలిపారు.

# పది పరీక్షలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి)



నిబంధనను అమలు చేశారు. ఉదయం 9.30 వరకు పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. ఐదు నిమిషాల నిబంధన అమలులో ఉండదంతో 9.35 నిమిషాల వరకు వచ్చిన విద్యార్థులను కూడా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు డిఈవో సోమశేఖర శర్మ తెలిపారు. పరీక్షల సన్నాహక చర్యల్లోభాగంగా సెట్ కాన్ఫరెన్స్‌లో ఛీఫ్ సూపరింటెండెంట్లకు, అధికారులకు, అబ్జర్వర్ మదన్‌మోహన్, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ పలు సూచనలు చేశారు.

**పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ...**
పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ పరిశీలించారు. ఖమ్మం నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరం, తాగునీరు, కనీస మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. ఎండల దృష్ట్యా వైద్య శిబిరం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడ ఏవిధమైన పొరపాట్లకు తావివ్వకుండా నిబంధనల మేరకు పరీక్షల నిర్వహణ చేయాలన్నారు. ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాల రవాణా పోలీస్ ఎస్కార్ట్ తో చేయాలన్నారు. మొబైల్ ఫోన్లను కేంద్రంలోకి అనుమతించవద్దని, విద్యార్థులతో పాటు సిబ్బందిని తనిఖీ చేసి లోనికి అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10,148, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 6,429 మొత్తం 16,577 మంది రెగ్యులర్, 279 మంది ప్రైవేటుగా పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. 97 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 97 మంది శాఖాధికారులు, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్, 97 సిట్టింగ్ స్క్వాడ్, 1983 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. జిల్లాలో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నయాబజార్ కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## డీసీఎం.. బైక్ ఢీకొని ఒకరి మృతి

### -ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరులోని ఎన్ఎస్పి డి ఈ కార్యాలయం ఎదురుగా సోమవారం డిసిఎం ను బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో ఇద్దరు తీవ్ర గాయాలు కాగా ఒకరు మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం వేంసూరు మండలం బీరాపల్లి లో వివాహ వేడుకకు హాజరై వస్తుండగా ఎన్ఎస్పిలోని డి ఈ కార్యాలయం ఎదురుగా ఆగి ఉన్న డీసీఎం వ్యానును వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరు కాళీ బాబు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం మెరుగైన వైద్యం కోసం తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు. కోటమర్తి కాళీ బాబు 18 చేతికొచ్చిన కుమారుడు మరణంతో బంధువులు మరియు తండ్రి అప్పారావులు బంధువులు ఆసుపత్రిలో రోదనలు మిన్నంటాయి. మరో ఇద్దరూ ఇనుపనూరి చరణ్ ఇంటర్ చదువుతున్నాడు. ఇనుప నూరి రవితేజ లు ఈ ముగ్గురిది కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామం వీరి ముగ్గురు ఉదయం పూట వివాహ వేడుకలకు వేంసూరు మండలం బీరాపల్లి వెళ్లారు మళ్లీ సాయంత్రం తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒకరు మరణించగా మరో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయమై కల్లూరి ఎస్ఐ షాకీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : కలెక్టర్





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో సజావుగా జరిగేలా అంతా సహకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ప్రియాంక ఆలా అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 16వతేద నుండి ఎన్నికల కోడ్ అమల్లోనికి వచ్చిందని, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందని చెప్పారు. 25,26న స్కూట్నీ, 29 వరకు ఉపసంహరణ, మే 13న ఎన్నికలు జరిపి జూన్ 4 ఫలితాలు లెక్కిస్తారని చెప్పారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా అంతా ప్రవర్తించాలని సూచించారు. ఏప్రిల్ 16 వరకు కొత్త ఓటర్లు ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం ఉందని, ఓటును ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాని ఐదు నియోజకవర్గాల పరిధిలో 1095 పోలింగ్ కేంద్రాలు, 984629 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీరిలో 506471 మంది మహిళా ఓటర్లు, 60 మంది ట్రాన్స్ జండర్లు, ఎన్ఆర్ఓలు 53 మంది, సర్వీసు ఓటర్లు 730 మంది, దివ్యాంగ ఓటర్లు 14021 మంది ఉండగా, మొత్తం పురుష ఓటర్లు 478098 మంది ఉన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్‌పి రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, పినపాక ఏఆర్ఓ ప్రతీక్ జైన్ తదితరులున్నారు.

## గుండెపోటుతో విద్యార్థి మృతి



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు పట్టణంకు చెందిన నీలం సుమంత్ (20) బీటెక్ విద్యార్థి హైదరాబాద్‌లోని రైలు ఎక్కి కల్లూరు వచ్చేందుకు రైల్వే స్టేషన్‌కు రాగా గుండెపోటుతో అక్కడికక్కడే మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. హైదరాబాద్‌లోని టీకేఆర్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్న విద్యార్థి కల్లూరుకు తన తల్లిదండ్రులు ఇంటికి వస్తున్న సమయంలో రైల్వే సమయంలో గుండె పోటు రావడం వలన మృతిచెందాడు. బంధువులు ఆసుపత్రికి తీసుకుపోయే లోపులేనే మరణించినట్లు వారి పేర్కొన్నారు. తల్లిదండ్రులు రమేష్, రమ్య లు లబోదిబోమంటూ దుఃఖిస్తూ వారిని ఎవరు ఆపలేని స్థితిలో ఉన్నారు.

# భక్తులకు లోటు పాట్లు లేకుండా నవమి ఏర్పాట్లు చేయాలి




ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీరామనవమ ఏర్పాట్లు పకడ్బందీగాచేయాలని, భక్తులకు ఎలాంటి లోటుపాట్లు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆలా అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన శ్రీరామనవమి, మహాపట్టాభిషేకంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బారికేడ్లు, సెక్టార్లు పద్ధతి ప్రకారం ఉండాలని, విద్యుత్ అంతరాయం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని, పండుగ సందర్భంగా పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ప్రతిపాదన పనులు వెంటనే మొదలు పెట్టి పూర్తి చేయాలని, గోదావరి ఘాట్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు అమర్చి ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహోత్సవాలు రోజుల్లో మధ్యం, మాంసం విక్రయాలు నిలుపుదల చేయాలని, హోటళ్లలో రుచిశుచి కరమైన వంటకాలు అందించేలా సంబంధిత అధికారులు చూడాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తలంబ్రాలు, ప్రసాదాల కౌంటర్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా అధికార యంత్రాంగం అంతా సమన్వయంతో పనులు చేపట్టి ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్, ఐఓ రమాదేవి, డిఆర్ఓ రవీంద్రనాద్, ఆర్‌డిఓ మధు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి మరణం... కుమారుడికి పరీక్ష

ప్రజాపక్షం/కల్లూరు: తండ్రి మృతదేహం ఇంటి ముందు ఉండగా పదో తరగతి పరీక్ష కు కుమారుడు దుఃఖ భారంతో పరీక్ష రాసిన సంఘటన కల్లూరు మండలం శ్రీరాపురంలో జరిగింది. కంటికి రెప్పలా కాపాడిన తండ్రి మారబోయిన గోపి (49) దూరమయ్యాడని బాధ దుఃఖం ఓవైపు ఉండగా అలాంటి బాధలో దుఃఖం మింగుతూ ఆపుకుంటూ విద్యార్థి 10వ తరగతి పరీక్షకు హాజరైన సంఘటన కల్లూరు లో జరిగింది. కల్లూరు పట్టణంలోని శ్రీరాంపురం కు చెందిన మారబోయిన అఖిల్ పదో తరగతి వార్షిక పరీక్షలు మొదటిరోజు కావడంతో దుఃఖంలో ఉన్న అఖిల్‌ను ఉపాధ్యాయులు, పెద్దలు, గ్రామస్తులు ధైర్యం చెప్పడంతో సముదాయించి పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష ముగిసిన వెంటనే వచ్చి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సెక్టోరియల్ అధికారులు




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పోలింగ్ కేంద్రాలను సోమవారం మండలం లోని సెక్టోరియల్ అధికారులు సందర్శించారు. జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల ను సెక్టోరియల్ అదికారులు సందర్శించి పలు వివరాలను సేకరించారు. మండల పంచాయతీ అధికారి శివ, మిషన్ భగీరథ ఏఈ విజయరాజు, ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, మిషన్ భగీరథ డీఈఈ ఓం ప్రకాష్ , ఖమ్మం అర్బన్ ఏవో శరత్‌బాబు లను మండలం లోని సెక్టోరియల్ అధికారులు గా నియమించారు. వీరికి ఒక్కోక్కరికి 9 నుంచి పోలింగ్ కేంద్రాలను 12 కేటాయించారు. కేంద్రంలో ఉన్న సమస్యలను గుర్తించి జిల్లా కలెక్టర్ కు నివేదిక ను అందించనున్నారు. విద్యుత్ తాగునీటి సరఫరా, టాయిలెట్స్ తదితర వాటిని పూర్తి స్తాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేలా అదికారులు కార్యచరణ ను రూపొందించారు. సెక్టోరియల్ అధికారులతో పాటు తహశీల్ధార్ గౌరిశంకర్, ఎంపీడీఓ యర్రయ్య లు కేంద్రాలను సందర్శించారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభ మయ్యాయి. మండలం లోని సింగారెడ్డిపాలెం పరీక్ష కేంద్రంలో 135 మందికి 134 మంది హజరయ్యారు. నేలకొండపల్లి ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద 160 మందికి మొత్తం హజరయ్యారు. చెరువుమాధారం పరీక్ష కేంద్రంలో 121 మందికి 120 మంది హజరయ్యారు. తొలి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి బీ.రాములు పరిశీలించారు. మండలం లోని పలు ప్రవేట్ పాఠశాల లకు చెందిన ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అదే విధంగా మండలం లోని జిరాక్స్ సెంటర్ లు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. అధికార యంత్రాంగం పది పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్ధులు తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

## వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసరాల అందజేత




**ప్రజాపక్షం/వైరా:** వైరా గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు వుండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో తల్లాడ మండలం అన్నారుగూడెంకి చెందిన వృద్ధ దంపతులు తొర్లపాటి దాసు మంగమ్మకు నిత్యవసర సరుకుల, ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వుండ్రు వరలక్ష్మి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంటి కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, ఆర్‌సి లగడపాటి ప్రభాకర్‌రావు, గంగవరపు కిషన్, డాక్టర్ రవిచంద్ర, వుయ్యూరు రామకృష్ణ, కె.గోపి తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

### భగత్‌సింగ్ 93వ వర్థంతి సభల పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యార్థి యువజన వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, మత విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. ఆజాద్, పివైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వి రాకేష్‌లు తెలిపారు. స్థానిక రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన భగత్‌సింగ్ 93వ వర్థంతి సభల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రా విభజన హామీల అమలులో భాగంగా ఐఐఎం, ఐఐటిలను, కేంద్ర విశ్వ విద్యాలయాలను ఎందుకు ఏర్పాటు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. నిరుద్యోగ యువతకు రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఎంత వరకు అమలు చేశారో యువతకు వివరించాలన్నారు. విదేశాల్లో దాగి ఉన్న నల్ల ధనాన్ని దేశానికి తీసుకు వచ్చి ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతాలో నగదు వేస్తామన్న హామీ ఎంత మందికి వేశారో చెప్పాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్య కాషాయికరణ చేయడం ఎంత వరకు సమాంజసమన్నారు. విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని వారు ప్రశ్నించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల స్ఫూర్తితో మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడం కోసం ఈనెల 23న భగత్‌సింగ్ 93వ వర్థంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా విద్యార్థి, యువతను చైతన్యవంతం చేసే దిశగా సభలు, సమావేశాలు నిర్వహించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మ ణ్, వి. వెంకటేష్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు భారత్, సురేష్, పిడిఎస్‌యు, పివైఎల్ జిల్లా నాయకులు వెంకటేష్, సతీష్, కరుణ్, పృథ్వీ, రవీంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి



**ప్రజాపక్షం/సుజాతనగర్:** "మన ఇసుక వాహనం" యాప్ ద్వారా ప్రజలు ఇసుక కావలసినవారు బుక్ చేసుకోవాలని సుజాతనగర్ తహశీల్దార్ గుడి చుట్టూ శిరీష తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక కోసం https.//tsmiv.cgg.gov.in ఆన్లైన్ లో లింకు ద్వారా గాని మీ మొబైల్ లో ప్లే స్టోర్ ద్వారా మన ఇసుక వాహనం యాప్ డౌన్లోడ్ చేసుకుని సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 8 రీచ్‌లలో ఇసుక లభ్యమవుతుందన్నారు. సుజాతనగర్ దగ్గరలో పాల్వంచ, లక్ష్మి దేవి పల్లి మండలాల నుండి ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. ఉదయం 6:00 నుండి సాయంత్రం 6:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఆన్లైన్లో చలానా ద్వారా డబ్బులు చెల్లించి బుక్ చేసుకోవచ్చన్నారు. అక్రమంగా ఇసుక మట్టి రవాణా చేస్తే లక్ష రూపాయలు బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. సుజాతనగర్ మండలంలోని రాఘవపురం, గొల్లగూడెం, హరిజనవాడ, మంగపేట గ్రామాలలోని అక్రమంగా ఉన్న రాంప్‌లు వద్ద జెసిబి తో గోతులు ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమ ఇసుక మట్టి రవాణా చేసిన వారిపై కట్టిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు. ఇసుక మట్టి కావలసినవారు సంబంధిత మైనింగ్ రెవెన్యూ అధికారుల ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు.

## నెంబరు ప్లేట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు

### -నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు -నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లైసెన్స్, నెంబరు ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ సిఐ మోహన్‌బాబు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఖమ్మం నగర పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 50 వాహనాలను గుర్తించి సీజ్ చేసి జరిమానా విధించారు. వాహన యజమానితోనే నెంబరు సరి చేయించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మోహన్‌బాబు మాట్లాడుతూ నగర పరిధిలో ప్రధాన కూడలితో పాటు ప్రధాన రహదారిపై నిరంతరం స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం ద్విచక్ర వాహనాల తనిఖీ చేస్తున్నామని రెండవ ప్రాధాన్యత కింద నాలుగు చక్రాల వాహనాలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, పరిమితికి మించి వాహనంపై ప్రయాణించే వారిని గుర్తించి జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. వాహనదారులు జరిమానాల నుంచి తప్పించుకునేందుకు రిజిస్ట్రేషన్ అయినప్పటికీ నెంబరు ప్లేట్లను తొలగించడం, నెంబరు ప్లేట్లను వంచడం, తుడిపివేయడం చేస్తున్నారని ఆయన తెలిపారు. దీనిని ఆసరా చేసుకుని కొంత మంది చోరీలకు పాల్పడినప్పుడు నెంబరు ప్లేట్లు లేని వాహనాలను వినియోగిస్తున్నారని దీని వల్ల చోరీలకు పాల్పడిన వారిని గుర్తించడం ఇబ్బందిగా మారుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను గుర్తించడం కూడా కష్టమవుతుందని తెలిపారు. మోటర్ వెహికిల్ నిబంధనల ప్రకారం వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలతో పాటు నెంబరు ప్లేటు ఉండాలని సూచించారు. తనిఖీల సమయంలో ఇవి లేకుండా వాహనాలు పట్టుబడితే ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వింత శబ్దాలతో పాటు తోటి వాహనదారులను భయపెట్టేలా సైలెన్సర్లను అమరుస్తున్న ఆకతాయిలు వెంటనే వాటిని తొలగించాలని లేని పక్షంలో వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి, వెంకన్న, సాగర్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ ప్రకటించి జీవో ఇవ్వడం పట్ల వైరా కమ్మజన సేవా సమితి హర్షం ప్రకటించింది. వైరా లోని కమ్మవారి కళ్యాణ మండపంలో కమ్మజన సేవా సమితి సమావేశం సోమవారం నిర్వహించారు. కమ్మ కులస్తుల చిరకాల కోరిక కమ్మ కార్పొరేషన్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాబినెట్ ఆమోదం తెలపడంతో వైరాలో కమ్మజన సేవా సమితి అధ్యక్షులు చింతనిప్పు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు అభిప్రాయాలు వెల్లడిస్తూ కమ్మ కులస్థులు కూడా పేదవారు ఉన్నారని ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుదలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుకున్నారని, అది ఈనాటికి నెరవేరిందని వారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల్లోనే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని వక్తలు అన్నారు. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించిన ఇతర నాయకులకి కమ్మజన సేవా సమితి రుణపడి ఉంటామని అన్నారు. కమ్మ సంఘం కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర వ్యవసాయ శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వరరావుకు, రాజ్యసభ సభ్యులు గారపాటి రేణుకాచౌదరికి ఏర్పాటుకు సహకరించిన ఇతర నాయకులందరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మజన సేవా సమితి నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, సూర్యదేవర శ్రీధర్, కాపా మురళీకబుష్ణ, లగడపాటి ప్రభాకర్‌రావు, దామా వీరయ్య, మందడపు మధుసూదన్‌రావు, చింతనిప్పు రాంబాబు, శ్రీరామనేని విజయభాస్కర్, చింతనిప్పు రాంబాబు, సూర్యదేవర కృష్ణప్రసాద్, ఎం.కృష్ణారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, రమేష్, పరుచూరి రాము తదితరులు ప్రకటించారు.

## సింగరేణి మండలంలో పర్యటించిన అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ సత్యప్రసాద్ పర్యటించారు. ప్రాథమిక పాఠశాల మంగలి తండా ప్రాథమిక పాఠశాల గేటు కారేపల్లి పాఠశాలను సందర్శించి మౌళిక వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. అలాగే పోలింగ్ బూత్‌ను సందర్శించడం జరిగింది. మాదారం గ్రామపంచాయతీని సందర్శించి అందుబాటులో గ్రామపంచాయతీ సెక్రటరీ బానోతు నరేష్ లేనందు వలన వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించడం జరిగింది. మండలంలోని గ్రామపంచాయతీ సెక్రటరీలు గ్రామాలను సందర్శించాలని, గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నత అధికారులు తెలియజేసి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

### మాదారం గ్రామపంచాయతీ కార్యదర్శికి షోకాస్ నోటీస్

## నేటి తరానికి ఆదర్శం మాడపాటి కమలమ్మ



**ప్రజాపక్షం/వైరా:** నేటి తరానికి ఆదర్శం అమరజీవి కామ్రేడ్ మాడపాటి కమలమ్మ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. సోమవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో కామ్రేడ్ మాడపాటి కమలమ్మ 23వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాడపాటి కమలమ్మ స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను ఎగరవేశారు. కమలమ్మ చిత్రపటానికి మాడపాటి వెంకట్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో బొంతు రాంబాబు మాట్లాడుతూ మాడపాటి కమలమ్మ తన జీవితాంతం పేద ప్రజల కోసం కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్ముకొని సొంత స్వార్థం లేకుండా పనిచేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొనే ధైర్యశాలి అఅన్నరు. నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నికరంగా నిలబడి నిరంతరం పోరాడుతుంది ఒక్క కమ్యూనిస్టులే అన్నారు. బూర్జువా పార్టీలు తమ అధికారాన్ని ఉపయోగించి పార్టీ ఫండ్ పేరుతో కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారుల కంపెనీల వద్ద నుంచి లక్షల కోట్ల రూపాయలు వసూలు చేస్తున్న సంగతి దేశ ప్రజలకు అర్ధమవుతుందని అన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడం వలన ఎలక్ట్రోరల్ బాండ్లు రూపంలో కోట్ల రూపాయలు రాజకీయ పార్టీల అకౌంటులోకి జమ అవుతున్నాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల్లో ఉండి పనిచేయడమే మాడపాటి కమలమ్మకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వైరా పట్టణ, రూరల్ కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, నాయకులు పైడిపల్లి సాంబశివరావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్‌రావు, పారుపల్లి కృష్ణారావు, గుమ్మా నర్సింహారావు, మాడపాటి మల్లికార్జున్‌రావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, వడ్లమూడి మధు, కమలమ్మ, కుమారులు, కుమార్తెలు, అల్లుళ్ళు, కోడళ్ళు, మనవళ్ళు, మనువరాళ్ళు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లయింగ్ బృందాల వాహనాలను ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణలో భాగంగా క్షేత్రస్థాయిలో నిఘా కొరకు ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ బృందాల వాహనాలను కలెక్టర్ విపి గౌతమ్ ప్రారంభించారు. సోమవారం నూతన కలెక్టరేట్‌లో ఫ్లయింగ్ బృందాల వాహనాలను కలెక్టర్ విపి గౌతమ్ జెండా ఊపి ప్రారంభించారు. ఇట్టి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఖమ్మం నియోజక వర్గంలో మూడు, పాలేరు నియోజక వర్గంలో మూడు, వైరా, సత్తుపల్లి, మధిర నియోజక వర్గాల్లో రెండు చొప్పున విధులు నిర్వహిస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, సిపివో శ్రీనివాస్, ఖమ్మం ఎంవిఐ వెంకటరమణ, అదనపు పౌర సంబంధాల అధికారి వి. శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ వద్దటూ టెంపుల్‌సిటీ వాసుల ఆందోళన




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా పంచాయతీపరిధిలోని టెంపుల్ సిటీ కాలనీవాసులు సోమవారం పెద్ద ఎత్తున ఆందోళనను నిర్వహించారు. కాలనీవాసుల ఆరోగ్యానికి ముప్పు తెచ్చే సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు వద్దంటూ కొవ్వొత్తులు పట్టుకుని,ఫ్లెక్సీలతో ర్యాలీగా నిరసన చేశారు. ఇంజం నరేష్ ఇంటిపై ఇండస్‌సంస్థవారు నిర్మించ తలపెట్టిన సెల్ టవర్ నిర్మాణానికీ,బిల్డింగ్‌కు ఎటువంటి అనుమతలు లేవన్నారు. కానీ మరొక ఇంటి నెంబర్‌తో సంస్థవారు అగ్రిమెంట్‌ని తీసుకుని ఏర్పాటుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. సెల్‌టవర్ ఏర్పాటు చేయనున్న ప్రదేశానికి అతి చేరువలో విద్యుత్‌వాఖకు చెంది హెచ్‌టి కరెంట్‌సరఫరా లైన్ ఉందన్నారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదకరమైన టవర్ ఏర్పాటు సరికాదని తక్షణమే నిలిపివేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని వృద్దులు,పెద్దలు,చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పది పరీక్షలు

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్:** ఖమ్మం రూరల్ మండలంలో తొలిరోజు నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 1009మంది విద్యార్థులకు గాను 1004మంది విద్యార్థులు పరీక్షకు హాజరైయ్యారు. 5గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. జలగంనగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 139మంది విద్యార్థులకు గాను ఒక్కరు గైర్హాజరయ్యారు. సత్యనారాయణపురంలోని కేజీబీవిలో 240మందికి నలుగరు గైర్హాజరయ్యారు.ఏదులాపురంలోని జిల్లా పరిషత్,తల్లంపాడులోని జిల్లా పరిషత్, గొల్లగూడెంలోని ఏజిహెచ్‌ఎస్‌లలో 100శాతం విద్యార్థులు హాజరయ్యారు.

## ప్రారంభమైన పది పరీక్షలు



**ప్రజాపక్షం/కరకగూడెం:** పదవ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమైన్నాయి. మొదటి రోజు 88 మంది విద్యార్ధులు పరీక్ష రాశారని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8:30కి పరీక్ష కేంద్రానికి చేరుకొని సందడి చేశారు. పరీక్ష కేంద్రంలోని 9గంటలకు విద్యార్థులను తనిఖీ చేసి లోనకు పంపించారు. మొదటి రోజు పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో వీరస్వామి, ఏడూళ్లబయ్యారం సిఐ కరుణాకర్, స్థానిక తహసీల్దార్ నాగ ప్రసాద్ సందర్శదించి వసతులను పరిశీలించారు. కరకగూడెం మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నుంచి 33 మంది విద్యార్థులు, గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి 37 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ హైస్కూల్ భట్టుపల్లి నుంచి ఇద్దరు, జిల్లా పరిషత్ హైస్కూల్ కరకగూడెం నుంచి 6 , జిల్లా పరిషత్ అనంతరం నుంచి 10 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొదటి రోజు 100 శాతం హాజరయ్యారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో పదో తరగతి పరీఓలు వ్రాస్తున్న విద్యార్థులు 539 మంది జెడ్పిహెచ్‌ఎస్ కారేపల్లి నందు 201 మంది విద్యార్దులకు 201 మంది, టిఎస్ మోడల్ స్కూల్ నందు 210 మంది విద్యార్థులు 210 మంది, జెడ్పిహెచ్‌ఎస్ కోమట్లగూడెం నందు 179 మంది విద్యార్థులకు 179 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులందరూ సకాలంలో హాజరై మండల విద్యాశాఖ అధికారి నేతృత్వంలో పరీక్ష కేంద్రంలో అన్ని సౌకర్యాలు సమకూర్చారు. మూడు పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్కాడ్ జయరాజు తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు.

# ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయాలి





**జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టర్ విపి గౌతమ్ నూతన కలెక్టరేట్‌లోని అన్ని శాఖల కార్యాలయాలను సందర్శించారు. రాజకీయ నేతల, రాజకీయ పార్టీలకు సంబంధించిన క్యాలెండర్లు, పోస్టర్లు, ఫోటోలు తొలగించింది లేనిది పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ఈనెల 16న విడుదల చేసిందని షెడ్యూల్ విడుదలైన తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలలో 24 గంటల్లో, పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద 48 గంటల్లో, ప్రైవేటు స్థలాల్లో 72 గంటల్లో రాజకీయ నేతలు, రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫోటోలను తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, నియమ నిబంధనలు అధికారులు, సిబ్బంది తప్పక పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, ఇంచార్జి రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌పోస్ట్ ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

**-చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ విపి గౌతమ్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. లోక్‌సభ సాధారణ ఎన్నికల సందర్భంగా ఖమ్మం నగరం కాల్వొడ్డు నయాబజార్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్‌పోస్ట్‌ను సోమవారం కలెక్టర్ విపి గౌతమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలన్నారు. నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని కలెక్టర్ తెలిపారు. సిసికెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల తనిఖీకి సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్‌పోస్ట్‌లో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ 24 గంటలు పటిష్ట నిఘా పెట్టాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సిహెచ్ స్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు





**వల్లభి చెక్‌పోస్ట్‌ను సందర్శించిన సిపి సునీల్ దత్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సరిహద్దుల్లో పటిష్టమైన చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. సోమవారం ముదిగొండ మండలం వల్లభి చెక్‌పోస్ట్‌ను సిపి సునీల్ దత్ సందర్శించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర పోలీస్ బలగాలతో పాటు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు సిపి తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశించే మార్గాలలో చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశామని జిల్లాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని నగరం నుంచి వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు చూపకుండా తరలించే నగదు, నగలు, ఇతరత్రా సొత్తును సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగిస్తామని సిపి తెలిపారు. ఎన్నికల నిబంధన మేరకు రూ. 50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలు ఉంటే తప్పనిసరిగా వెంట సంబంధిత పత్రాలు ఉండాలని సూచించారు. జిల్లాలో 12 ఎఫ్ఎస్టి, 15 ఎస్ఎస్టి, రెండు ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్ పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, ఎనిమిది ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని 24 గంటలు నిఘా ఉంచామని తెలిపారు. తనిఖీలు చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని సిపి సూచించారు.

# తిరుపతికి తరలిన చిమ్మపుడి కోలాట బృందం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తిరుమల తిరుపతి దేవస్థానం ఆవరణలో కోలాటం నిర్వహించేందుకు చిమ్మపుడి మహిళా కోలాట బృందం తరలి వెళ్లారు. సోమవారం రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామానికి చెందిన కోలాట మహిళా బృందాన్ని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తిరుపతి తీసుకెళ్లారు. ప్రతి ఏడాది గుత్తా వెంకటేశ్వర్లు సారధ్యంలో కోలాట బృందం తిరుపతి దేవస్థాన ఆవరణలో కోలాటం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా 150 మంది మహిళలు వారి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతిలో స్వామి వారి సన్నిధిలో కోలాటం నిర్వహించేందుకు తరలి వెళ్లారు.

# వెంకట్ నారాయణకు చిరు సత్కారం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** పాలేరునియోజకవర్గ సిపిఐ నాయకులు లింగావెంకటనారాయణకు టిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం చిరు సత్కారం లభించింది. ఈనెల 16,17 తేదీలలో ఖమ్మం నగరంలో ఏఐటీయూసీ, ఎస్ఎఫ్ఐఆర్టిడబ్ల్యూ తృతీయ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ మహాసభల విజయంతానికి కృషి చేయడం పట్ల ఆయన నివాసం వద్దకు వెళ్లి మెమెంటోను అందజేసి యూనియన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ అప్పారావు, ఖమ్మం డిపో ఆర్టీసీ కార్యదర్శి బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

# ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

**- బికేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఉపాధిహామీ కూలీ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బికేఎంయూ)జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం గ్రామంలో గల ఈదుల చెరువులో ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని పరిశీలించారు. తొలుత కూలీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2023కు సంబంధించిన జనవరి,ఫిబ్రవరి,మార్చి,2024 బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. దీంతో ఆ నిరుపేద కూలీలు గుప్పెడు పొట్ట నింపుకోవడానికి అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టం ద్వారా కార్మికులను నమోదు చేయడం సరికాదని తక్షణమే దానిని రద్దు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు టెంటు మెడికల్‌కిట్లు పనిచేయటానికి పనిముట్లు అందించాలని వాటితో పాటు వేసి అలవెన్సును కూడా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బికేఎంయూ జిల్లా ఉపాధ్యక్షులు పగీళ్ల వీరభద్రం, మండల కార్యదర్శి మేళ్లచెరువు వీరబాబు ఉన్నారు.

# ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండలంలోని కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల , తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల , తనికెళ్ల సెయింట్ అలోసిఎస్ హైస్కూల్ , సింగరాయపాలెం హైస్కూల్ లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు పరీక్ష ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యార్థులందరు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాశారని పేర్కొన్నారు. నాలుగ కేంద్రాలలో మొత్తం 706 మంది విద్యార్థులకు గాను 700 మంది విద్యార్థులు పరీక్ష రాశారని 6 గురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా పరిషత్ కొణిజర్లలో 224 మందికి గాను 223 మంది హాజరైనారు. ఒక్క విద్యార్థి గైర్హాజరైయ్యారు. తనికెళ్ల హైస్కూల్‌లో 188 మందికి గాను 184 మంది హాజరు. 4 గురు గైర్హాజరు. సెయింట్ అలోసిఎస్ లో 167 మందికి గాను 166 మంది హాజరు. ఒక్కరు గైర్హాజరు. సింగరాయపాలెంలో హైస్కూల్‌లో 127 మందికి 127 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఆయా కేంద్రాలవద్ద అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.